# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

తేది : 05 -01-2026 సమయం : 6.45 గంటలు

## ముఖ్యాంశాలు

1. అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు.
2. పోలవరం - నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టు పై రాష్ట్ర ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు.
3. ప్రజలకు ఆరోగ్య మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.
4. ఆంధ్రప్రదేశ్ లో విద్యుత్ ఛార్జీల భారం ప్రజలపై పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కార్మిక శాఖ శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ వెల్లడించారు.

-----------------------

ఆంధ్రప్రదేశ్ లోని విజయనగరం జిల్లాలో నిర్మాణంలో ఉన్న భోగాపురం విమానాశ్రయం రన్‌వేపై విమాన ల్యాండింగ్ పరీక్షకు ఢిల్లీ నుంచి స్థానిక పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడితో కలిసి కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఎయిర్ ఇండియా ప్రత్యేక విమానంలో నిన్న చేరుకున్నారు. అనంతరం రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. దేశంలోని ఇతర విమానాశ్రయాలకు ధీటుగా భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నిలుస్తుందన్నారు.

భోగాపురం గ్రీన్ ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రయోగాత్మకంగా చేపట్టిన తొలి విమానం ల్యాండింగ్ విజయవంతం కావడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా ఉత్తరాంధ్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది జూన్ నాటికి మిగిలిన పనులూ పూర్తిచేసి విమానాశ్రయాన్ని అందుబాటులోకి తెస్తామని వివరించారు. అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ నిర్మిస్తున్న పోలవరం - నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టు - పీఎన్ఎల్‌పీకు పర్యావరణ అనుమతులు జారీ చేయకుండా, కేంద్ర ప్రభుత్వం తగిన ఆదేశాలు ఇవ్వాలంటూ సుప్రీంకోర్టును తెలంగాణ ప్రభుత్వం కోరింది. ఈమేరకు పోలవరం - నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం వేసిన

పిటిషన్‌పై ఈరోజు సుప్రీంకోర్టులో విచారణ జరగనుంది. ఈ నేపథ్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, నీటి వనరుల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్.. రెడ్డి సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వితో నిన్న ముంబయిలో సమావేశమయ్యారు. ఈసందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున వాదనలు వినిపించేందుకు, అన్ని ఆధారాలను సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు.

----------------------

ప్రజలకు ఆరోగ్య మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రంలో పడకలను మంత్రి నిన్న ప్రారంభించారు. అనంతరం మంత్రి రామానాయుడు మాట్లాడుతూ,

వాయిస్..25 సెకన్లు

-------------------------

ఇతర భాషలు నేర్చుకున్నప్పటికీ మాతృభాషకు ప్రాధాన్యతను ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభాపతి సిహెచ్ అయ్యన్నపాత్రుడు సూచించారు. ఆంధ్ర సారసత్వ పరిషత్ ఆధ్వర్యంలో గుంటూరులో రెండో రోజు జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల్లో మారిషస్ అధ్యక్షులు ధరమ్ బీర్ గోకుల్ తో పాటు పలువురు ప్రముఖులు, భాషాభిమానులు, సాహితీ వేత్తలు నిన్న పాల్గొన్నారు. ఈసందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. తెలుగుభాష ప్రస్తుత పరిస్థితిని తెలియజేస్తూనే.. భాషాభివృద్ధికి ప్రభుత్వం, ప్రజలు తీసుకోవాల్సిన చర్యలను

వివరించారు. తెలుగు భాషను, సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని సూచించారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ లోని మారుమూల గిరిజన గ్రామాలకు 105 కోట్లరూపాయలతో రహదారుల నిర్మాణం చేపడుతున్నామని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో మంత్రి క్యాంపు కార్యాలయంలో నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, డోలీ రహిత గ్రామాలే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఈ అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ .. 30 సెకన్లు

-------------------------

ఆంధ్రప్రదేశ్ లో విద్యుత్ ఛార్జీల భారం ప్రజలపై పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మంత్రి ఒక విడియో సందేశంలో మాట్లాడుతూ .. విద్యుత్ వ్యవస్థను గాడిన పెట్టేందుకు ప్రభుత్వం సంస్కరణలు చేపడుతోందని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ ఛార్జీలను పెంచకుండా ట్రూఅప్ ఛార్జీలను ప్రభుత్వమే భరింస్తోందని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్..30 సెకన్లు

-------------------------

తెలంగాణ ములుగు జిల్లాలోని మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరకు సంబంధించిన పనులన్నింటినీ ఈ నెల 20 లోపు పూర్తి చేయిస్తామని జిల్లా ఇన్ ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మేడారంలో జరుగుతున్న జాతర ఏర్పాట్లకు సంబంధిత అధికారులతో కలిసి నిన్న పరిశీలించారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడారు. 200 ఏళ్ల వరకు చెక్కుచెదరకుండా ఉండేవిధంగా రాతి దిమ్మెలతో వనదేవతల గద్దెల ప్రాంగణం పునర్నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. ఈసారి తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి గిరిజన, గిరిజనేతర భక్తులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశముందని అంచనా వేస్తున్నామని మంత్రి వివరించారు.

-------------------------

భూ రికార్డులను ఎవరూ మార్పు చేసేందుకు వీలులేకుండా ఆధునిక పరిజ్ఞానంతో డిజిటలీకరణ చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. ఏలూరు జిల్లా నూజివీడు మండలం మర్రిబంధం గ్రామంలో నిర్వహించిన "మీ భూమి-మీ హక్కు" కార్యక్రమంలో రాజముద్రతో ముద్రించిన పట్టాదార్ పాస్ పుస్తకాలను రైతులకు ఆయన నిన్న పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారధి మాట్లాడుతూ, ప్రజల హక్కులను కాపాడేందుకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఇటీవల 22A భూ సమస్యల పరిష్కారంపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక చర్యలు తీసుకుని వివాదాస్పదం కానీ భూములను 22A నుండి తొలగించారని మంత్రి తెలియజేశారు.

................

అవయవాలను దానంచేసిన జీవన్మృతుల కుటుంబాలకు లక్ష రూపాయల చొప్పున అందచేయాలని ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు. దీనివల్ల బాధిత కుటుంబాలకు సాంత్వన చేకూర్చడంతో పాటు అవయవదానాలను మరింత ప్రోత్సహించినట్లవుతుందని వెల్లడించారు. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ తరపున ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపామని ఒక ప్రకటనలో తెలిపారు 2025 జనవరి నుంచి డిసెంబరు వరకు 93 మంది జీవన్మృతుల నుంచి సేకరించిన అవయవాలను సుమారు 300 మందికి అమర్చారని తెలిపారు. అవయవ దానాన్ని మరింత ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని మంత్రి వివరించారు.

..............................

ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో చలి తీవ్రత కొనసాగుతోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా, జి.మాడుగులలో 9.3 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా.. తెలంగాణా సంగారెడ్డి జిల్లా కోహిర్లో 11.1 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. పొగమంచు దట్టంగా కమ్ముకోవడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.